ఇటలీ కమ్యూనిస్టుపార్టీని సోషలిస్టు పార్టీ బలపరుస్తూన్నది. అందుచేతనే ఇప్పటికీ అక్కడ కమ్యూనిస్టులు రాజకీయరంగంలో కొంత బలం కలిగివున్నారు. పార్లమెంటులో 843 స్థానాలలో 292 స్థానాలు కమ్యూనిస్టులచేతుల్లో వున్నాయి. అయితే కమ్యూనిస్టుల స్థానాలు 192 మాత్రమే.

ఇటలీ కమ్యూనిస్టు పార్టీలో 21, 137 మంది సభ్యులున్నారని ఆ పార్టీనాయకులు అంటారు; ఇతరుల అంచనా ప్రకారం 17,00,000 మంది సభ్యులున్నారు. దక్షిణ ఇటలీలో వందల కొద్దీ మంది సభ్యులు కమ్యూనిస్టుపార్టీనుంచి రాజీనామా యిస్తున్నారని గతమార్చిలో స్వతంత్ర ఇటాలియన్ వార్తాసంస్థ యుడాప్రకటించింది వీరందరూ స్వతంత్ర రాజకీయ పక్షాలలో చేరుతున్నారని కూడా అది తెలియపరచింది.

పోతే మిగతా పశ్చిమ యూరప్‌దేశాలలో కమ్యూనిస్టుల బలం క్షీణిస్తూంది. పశ్చిమ జర్మనీలో కమ్యూనిస్టు పార్టీని రాజకీయంగా ఎవరూ ఖాతరు చేయరు. పార్లమెంటులో కమ్యూనిస్టులకు స్థానాలు లేవు.

ఆస్ట్రియాలో కమ్యూనిస్టు పార్టీ అంటే ప్రజలకు చెడ్డఏవగింపు. నిజానికి మాస్కోకూడా ఆస్ట్రియన్ కమ్యూనిస్టును చిన్నచూపు చూస్తుంది.

ఇకడెన్మార్క్, నార్వేలలోని కమ్యూనిస్టుల బలం 1945 లో కంటే సగానికి తగ్గింది; సగం కంటే తక్కువే అని కూడా చెప్పాలి.

---

స్కెచ్

# నిరుద్యోగుల సమితి

వల్లూరి కృష్ణారావు

మొత్తం రాష్ట్రంమీద ఎంతమంది నిరుద్యోగులున్నదీ తెలుసుకోడానికి ఆంధ్రప్రభుత్వం ఒక నూతనప్రయత్నం తలపెట్టింది ఈమధ్య. ఈ నిరుద్యోగులమొత్తం సంఖ్య తేల్చుకోడానికిగాను కొంతమంది ప్రభుత్వోద్యోగులు పర్యటిస్తారు రాష్ట్రమంతటా. ఈ వివరాలు సేకరించడానికి ఆంధ్రప్రభుత్వం తగినంత శిక్షణ ఈ ఉద్యోగులకిస్తుంది. బాగుంది. నిరుద్యోగులసంఖ్య తేల్చుకోడానికిగాను కొంతమంది సిబ్బందిని తయారు చేయడం. దానికి ఒకప్రత్యేకశిక్షణ కేంద్రాలయం!

రాష్ట్రం మొత్తంమీద నిరుద్యోగులసంఖ్య నిర్ధారణ చేసుకున్నాక వారికి ఉపాధి కల్పించడానికేమో ఈ మహాప్రయత్నం తలపెట్టినది! అయితే ఉపాధి కల్పించడానికి నిరుద్యోగుల మొత్తం సంఖ్య దేనికి! ఏమయినా మా ఊళ్లో ఉన్న నిరుద్యోగులమంతా చంకలెగరేశాం. మేము మామూలుగా సమావేశమయ్యే 'క్లబ్బు' దగ్గర సమావేశమయ్యాము. ఇంకా బసవపున్నయ్యగారు రాలేదేంచెప్మా?

"అరుగో వచ్చేస్తున్నారు" జూనియర్ నిరుద్యోగి అన్నాడు. నిరుద్యోగులు రెండురకాలుగా కేటాయించబడ్డారు మా ఊళ్లో. చాలాకాలం నుంచి నిరుద్యోగులుగాఉంటున్నవారు 'సీనియర్సు' సరే మిగతావారు "జూనియర్సు."

"ఏమిటీ! అంతా హుషారుగా ఉన్నాయి జీవులు" అన్నారు బసవపున్నయ్యగారు. నిరుద్యోగుల్ని అలానే అంటారాయన. మాకు బసవపున్నయ్యగారిమీద గౌరవం అపారం. కొన్ని ఉద్యోగ వ్యాపారలక్షణాలు, కిటుకులు చెప్తారు. ఆయన మా ఊరి కుర్రకారు శ్రేయోభిలాషి, ఎప్పుడూ "క్లబ్బు"కు వస్తూ మా కుర్రవాళ్ళకు హితవు గరుపుతూంటారు. సరే అది ఆయన సంగతి.

"ఆ మరేంలేదండి. మనప్రభుత్వం "సిగ్గుపడుతూ చెప్పుతున్నాడు జగన్నాథం. "నిరుద్యోగుల వివరాలు సేకరించడానికి కొంతమంది సిబ్బందిని తయారుచేస్తోంది,"

"అదా! మరే. దినపత్రికలో చూశా."

"ఏమంటారు?" అన్నాను నేను.

"ఒరే అబ్బాయిలూ! ఈ మాత్రానికి పెద్ద రాద్ధాంతం చేస్తున్నారు. అవునురామరి. మీకు పెష్ట పుట్టదయ్యె. ఉద్యోగాలు కావాలని."

"ఆఁ!" అని 'కోరస్సు'లో అరిచి ఆశ్చర్యం ప్రకటించాం. తీవ్ర ప్రతిఘటన!

"కాదురాబాబులూ! మీకు ఉద్యోగాలు కావాలని మీలోమీరు అనుకుంటున్నారుగాని ఏ విధమయిన ఆందోళనైనా లేవదీసారా? లేదు. అది ప్రభుత్వమే చేస్తోంది. మహమ్మదయినా వెళ్ళాలి పర్వతం దగ్గరకు; పర్వతమయినా వెళ్ళాలి మహమ్మదు దగ్గరకు. రెండవది జరిగింది."

"మాదే లోపమంటారు" నర్సింహం కళ్ళ జోడుతీసి మరీ అన్నాడు.

"ఆహా!" పున్నయ్యగారి కనుబొమ్మలు నుదుటి పైకంటా పోయాయి. ఇంకా ఆయన ఇలా అన్నారు సావధానంగా.

"ఒరే కుఙ్కుంకలురామీరు. మీకు అభమూ, శుభమూ తెలియదు. ప్రభుత్వం మీ దగ్గరకు రావడం నాకేం బాగుండలేదు."

"మరి మమ్మల్ని ఏం చేయమన్నారు?" అన్నాడు పద్మనాభం.

"అలా దారికి రండి. చెప్తా, ఇపుడసలే మన ప్రభుత్వం పెద్ద ఆయాసంకలిగించే పనుల్లో నిమగ్న మయింది. మీరు అంటే నిరుద్యోగులు పెద్ద 'పన్ను' (Tax) గా బాధపడుతోంది ప్రభుత్వం. ఇంత ఒడుదుడుకుల్లో ప్రభుత్వానికి మీరు శ్రమ కలిగించడం మీకు న్యాయంకాదు."

"అంటె మమ్మల్ని ప్రభుత్వందగ్గరకు వెళ్ళాలంటారు కదూ!" అన్నాడు పద్మనాభం తిరిగి.

"ఒరే నాన్నా, లాజిక్కేమిటే రానీ 'సబ్జెక్టు' రైటుగా చెప్పావు. "మీరంతా ప్రభుత్వం దగ్గరకు వెళ్ళండి."

"కర్నూలా" అన్నాను అమాయకంగానే. హాలు హాలు అంతా నవ్వుదొంతర్లతో నిండింది. కడుపు చేత్తోపట్టుకొని,పున్నయ్య ఇలా అన్నారు.

"హాస్యం అంటే ఇదిరా అబ్బీ! అదిసరే. చూడండి. ప్రభుత్వం ప్రతీ గ్రామాన్నీ మీ కోసం చూడ్డానికి వస్తోంది. అవునా! అంచేత ప్రతీగ్రామం గ్రామ నిరుద్యోగ సంఘాలుగా ఏర్పడాలి. అన్నీ కలసి రాష్ట్ర నిరుద్యోగ సంఘంక్రింద ఏర్పడాలి. దీనికి కావలసిన శాఖ లేర్పరుచుకోండి. ప్రతీగ్రామానికీ ఒక ప్రతినిధిని ఎన్నుకోండి. ఈ ప్రతినిధులంతా ప్రభుత్వానికి మీ కనీస హక్కులు తెలియజేస్తారు. ఉద్యమంలో మన గ్రామం ఆదర్శగ్రామం కావాలి. ఈ మహా ప్రయత్నంలో ప్రతీ నిరుద్యోగికష్టపడి పనిచేయాలి సంఘసభ్యుడై అన్ని గ్రామానికి ఇలా కబుర్లు పంపించండి. అలా ప్రభుత్వానికి పనిని తేలిక చెయ్యండి."

"మంచి యోచన"అని హుషారుగా అరిచాము. పున్నయ్యగారి మొహం పున్నమిలా మెరిసింది.

కాని అన్ని మొహాలు వెనక్కి తిరిగాయి.

"చెప్పు" పున్నయ్యగారి అనుజ్ఞ!

"మీరు చెప్పింది చాలామటుకు నచ్చింది. చూడండి. ప్రభుత్వం ప్రతీగ్రామంలోని నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడానికి రావడంలేదు. నిరుద్యోగుల వివరాలు సేకరించడానికి మాత్రమే వస్తోందనుకుంటాను"అన్నాడు ఉద్యోగాలవేటలో పరాజితుడైన సుబ్రమణ్యాం.

"అవును ప్రభుత్వం అందరికీ ఉద్యోగాలు ఇవ్వడానికని యింటింటికీవచ్చి పిలవాలా? కాకితో కబురంపితే పోమూ?" అన్నాడు సోమశేఖరం.

బసవపున్నయ్య లేచారున్నాడు. "అవును అబ్బాయిలూ. ఆ తండ్రి చెప్పింది నిజమే."

"అయితే ఈ దురద దేనికి పెద్ద సంఘాలుగా ఏర్పడం అదీ అంతా?"

"అవునురాబాబులూ! రూపాయి బిళ్ళకు రెండు వైపులుంటాయిరా. బొమ్మ కాకపోతే బొరుసు. ప్రభుత్వమెలాగూ ఉద్యోగాలు ఇవ్వడానికి కాదు వస్తూంట మీ వివరాలు సేకరించడానికి వస్తుందా? అవునామరి. అది మీకు ఎలాగూ నిరుపయోగమయినపుడు మీరు మాత్రం దిగాలు పడ్డందేనికి?" అనాడు బసవపున్నయ్య.

'అసలు ప్రభుత్వం అంటూ మా దగ్గరికి వస్తే మాకు ఉద్యోగాల బెంగే లేదంటాము. మనమంతా ఉత్తినే చిన్నయిపోవడం దేనికి?" అన్నాడు మూర్తి. ఆఖారు సారిగా అంతా ఏకీభవించాం. కాని ఒకటే చిత్రం. బసవపున్నయ్యగారు 'ప్లేటు' తిప్పినందుకు మాలో ఎవరికీ 'ఇది'కలగలేదు ఆయనమీద. ఆయన మాటకాదనము... ★